క్లుప్తంగా

ఘనంగా ఆరాధనోత్సవం


ప్రసంగిస్తున్న పాస్టర్ రెవరెండ్ బీ విశ్వమోహన్

పామిడి: మండలంలోని అన్ని చర్చిలలో ఆదివారం ఆరాధనోత్సవం ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా స్థానిక సీఎస్ఐ చర్చిలో నిర్వహించిన ఆరాధన కార్యక్రమంలో పాస్టర్ రెవరెండ్ బీ విశ్వమోహన్ క్రైస్తవులను ఉద్దేశించి ప్రసంగించారు. దేవుని యందు చిన్న నాటి నుంచి భయభక్తులు గల వారి జీవితాలు ధన్యకరమవుతాయన్నారు. కార్యక్రమంలో చర్చి సభ్యులు, క్రైస్తవులు పాల్గొన్నారు.

కంపచెట్ల తొలగింపు

యల్లనూరు: మండలంలోని తిరుమలాపురం గ్రామంలో పొలాలకు వెళ్లే రహదారిలో ఇరువైపులా కంపచెట్లు ఏపుగా పెరగడంతో.. జేసీబీ సహాయంతో ఆదివారం వైఎస్సార్‌సీపీ సర్పంచు రామాంజులరెడ్డి తొలగించారు. కంపచెట్ల వల్ల పొలాల్లోకి వెళ్లేందుకు ఇబ్బందిగా ఉండని, రైతులు విన్నవించగా సర్పంచ్ స్పందించారు. సర్పంచు నిధులతో జేసీబీతో కంపచెట్లను తొలగించారు. దీంతో సర్పంచును గ్రామస్తులు అభినందించారు.

పోలీస్‌స్టేషన్‌కు చేరిన ఆలయ నిర్మాణ పంచాయితీ

శింగనమల: మండలంలోని సి.బండమీదపల్లిలోని సచివాలయం సమీపంలో శివాలయం నిర్మాణం చేపడుతామని ఆదివారం కొంత మంది టీడీపీ నాయకులు ప్రయత్నించారు. సచివాలయం సమీపంలో చర్చి పక్కన ఉన్న కొండకు మట్టి తీయడంతో వివాదం ఏర్పడింది. కొండకు ఉన్న ఎర్ర మట్టిని జేసీబీతో చదును చేస్తుండడంతో, శింగనమల పోలీస్‌స్టేషన్‌లో గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. దీనితో గ్రామస్తులందరిని పిలిపించి పోలీసులు విచారణ చేపట్టారు. అందరూ కలిసి శివాలయ నిర్మాణం చేపట్టాలని పోలీసులు సూచించారు.

సమస్యలు పరిష్కరించాలి


మాట్లాడుతున్న రాజేష్‌గౌడ్

గుంతకల్లుటౌన్: ప్రభుత్వం ఉద్యోగ, కార్మిక సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు రాజేష్‌గౌడ్ డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక సీపీఐ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఔట్‌సోర్సింగ్ కార్మికులకు నెలకు కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు పీఆర్సీలో ఉన్న బకాయిలన్నీ విడుదల చేయాలన్నారు. అసంఘటిత కార్మికులైన హమాలీ, ఆటో, వీధి విక్రయదారుల కోసం సంక్షేమ బోర్డును ఏర్పాటు చేసి, వారి అభివృద్ధికి పాటుపడాలని ఆయన విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ మండల అధ్యక్ష, కార్యదర్శులు సురేష్, ఈశ్వరయ్య, జిల్లా కార్యదర్శి ఇబ్రహీం, సహాయ కార్యదర్శి నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

రాగులపాడు లిఫ్ట్ నుంచి చెరువులకు నీరందించాలి

గుంతకల్లు రూరల్: రాగులపాడు లిఫ్ట్ నుంచి గుంతకల్లు నియోజకవర్గంలోని అన్ని చెరువులకు నీటిని అందించాలని కోరుతూ సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు డి. జగదీష్ తదితరులు రాష్ట్ర ఆర్థిక శాఖామంత్రి పయ్యావుల కేశవ్‌కు విన్నవించారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకట శివుడుయాదవ్, రైతు సంఘం నాయకుడు సందిరెడ్డి జయరాములు, సీపీఐ గుంతకల్లు మండల కార్యదర్శి రాములులతో కలిసి ఆయన ఆదివారం మంత్రిని కలిశారు. జగదీష్ మాట్లాడుతూ గుంతకల్లు, ఉరవకొండ నియోజకవర్గాల్లోని చెరువులన్నింటికీ కృష్ణా జలాలను అందిస్తానని ముఖ్యమంత్రి చంద్రబాబు పామిడిలో జరిగిన బహిరంగ సభలో హామీ ఇచ్చారన్నారు. ఆ మాటను నిలుపుకుంటూ చెరువులకు నీటిని అందించి సాగు, తాగు నీటి కష్టాలను తీర్చేందుకు చర్యలు చేపట్టాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు.

రోడ్డు నిబంధనలు పాటించాలి


వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ శరత్‌చంద్ర

శింగనమల: వాహనదారులు రోడ్డు నిబంధనలు పాటించాలని ఎస్‌ఐ శరత్ చంద్ర సూచించారు. ఆదివారం వెస్ట్ నరసాపురం వద్ద గార్లదిన్నె రోడ్డుపై వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన వాహనదారులకు నిబంధనలపై అవగాహన కల్పించారు. ద్విచక్రవాహనదారులు డ్రైవింగ్ లైసెన్స్‌తో పాటు, హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలన్నారు. అనంతరం లైసెన్స్ లేనివారి నుంచి అపరాధ రుసుము వసూలు చేశారు. ఏఎస్‌ఐ చిరంజీవయ్య, హెడ్ కానిస్టేబుల్ గంగాధర, సిబ్బంది పాల్గొన్నారు.

చీనీ రైతులకు గుండెకోత


గిర్రమ్మబావి వద్ద ఓ రైతు తోటలో తెగుళ్లు సోకిన చీనీ చెట్లను నరికి వేసిన దృశ్యం

యల్లనూరు మండలంలోని గిర్రమ్మబావి సమీపంలో తెగుళ్లు సోకడంతో సుమారు మూడెకరాల్లో చీనీ పంటను ఓ రైతు తొలగించాడు. అలాగే చింతకాయమంద గ్రామానికి చెందిన మరో రైతు రెండెకరాల్లో చీనీ పంటను సాగు చేశాడు. తెగుళ్లు అధికం అవడంతో దిక్కుతోచక, ఉద్యానశాఖ అధికారుల సలహాలు కరువై అన్నదాతలు చీనీ చెట్లు తొలగించుకుంటున్నారు. దీంతో పదరు రైతులు రూ.లక్షల్లో నష్టపోయారు. ఇలా యల్లనూరు, పుట్లూరు మండలాల్లో పలువురు రైతులు తెగుళ్లను నివారించలేక చీనీ చెట్లను నరికేస్తున్నారు.

- తెగుళ్లతో వచ్చిన చెట్ల నరికివేత
- పత్తాలేని ఉద్యాన అధికారులు

యల్లనూరు: అరుగాలం శ్రమించి చీనీ పంట సాగు చేసిన అన్నదాతలకు నష్టాలే మిగులుతున్నాయి. ఇటు తెగుళ్లను నియంత్రించలేక.. అటు క్రిమిసంహార మందులను కొనలేక ఇబ్బందిపడుతున్నారు. యల్లనూరు, పుట్లూరు మండలాల్లో చీనీ, అరటి, దానిమ్మ, మామిడి, సపోట, జామ వంటి పంటలను విరివిగా పండిస్తారు. అయితే రైతులను చీనీ పంట నట్టేట ముంచుతోంది. బంక, వేరుకుళ్లు, బూడిద తెగుళ్లతో ఏళ్లుగా సాగుచేసుకుంటున్న చీనీ చెట్లు నిట్టనిలువునా ఎండిపోతుండడంతో అన్నదాతలు ఆవేదన చెందుతున్నారు.

పట్టించుకోని ఉద్యాన అధికారులు..

జిల్లాలో ఉద్యాన పంటలకు యల్లనూరు, పుట్లూరు మండలాలు పెట్టింది పేరు. వేల హెక్టార్లలో చీనీ, అరటి తదితర పండ్లమొక్కలను పెంచుతున్నారు. అన్నదాతలకు సరైన సమయంలో ఉద్యాన అధికారుల సలహాలు, సూచనలిచ్చిన దాఖలాలు లేవు. అధికారుల కోసం కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా కనిపించకపోవడంతో నిస్సహాయ స్థితిలో దిక్కుతోచక పచ్చని పంటలను నరికేసుకుంటున్నారు. నెలల తరబడి అధికారులు కనిపించకపోవడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు.

రెగ్యులర్ హెచ్‌ఓ లేక..

తాడిపత్రి ఉద్యాన అధికారి ఉమాదేవికి యల్లనూరు ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించారు. రెండు మండలాల బాధ్యత ఉండటంతో ఆమె యల్లనూరు రైతులకు అందుబాటులో ఉండటం లేదన్న ఆరోపణలున్నాయి. అకాల వర్షాలు, నష్టం జరిగిన సమయాల్లో కూడా ఆమె కనిపించడం లేదని రైతులు వాపోతున్నారు. ప్రకృతి వైపరీత్యాలతో చీనీ, అరటి, దానిమ్మ, సపోట, మామిడి తదితర ఉద్యాన పంటలకు నష్టం జరిగితే క్షేత్రస్థాయిలో పరిశీలించేందుకు అధికారులు పత్తా లేకుండా పోతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి ఉద్యాన శాఖ అధికారులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని పలువురు రైతులు కోరుతున్నారు.

చీనీ సాగు ఇలా..

మండలం	హెక్టార్లు
యల్లనూరు	2,400
పుట్లూరు	2,000
తాడిపత్రి	1,900
గార్లదిన్నె	1,800
నార్పల	1,500

గుండె తరుక్కుపోతోంది



రెండెకరాల్లో చీనీ పంటను సాగు చేశా. ఉద్యాన అధికారుల సలహాలు లేకపోవడంతో తెగుళ్లు అధికమై వచ్చిన చెట్లను నరికేసుకున్నా. రైతు కష్టాలని అధికారుల సలహాలు తోడైతే పంట దిగుబడులు సాధించవచ్చు. నా చేతితో నాటిన చీనీ చెట్లను నరికేస్తుంటే గుండె తరుక్కుపోతోంది.

– మల్లికార్జున, రైతు, చింతకాయమంద

చీనీ చెట్లు ఎండుతున్నాయి



ఐదెకరాల్లో చీనీ చెట్లు సాగుచేశా. వేరుకుళ్లు, బంక తెగుళ్లతో చీనీ చెట్లు అక్కడక్కడా ఎండుముఖం పట్టాయి. మాకు దిక్కుతోచడం లేదు. ఏ మందులు వాడితే పొలం ఏమవుతుందోనని ఆందోళనగా ఉంది. అధికారుల సలహాలు ఇస్తే చీనీ చీనీ సాగులో అధిక దిగుబడులు సాధించవచ్చు.

– రమేష్, రైతు, పెద్దమల్లేపల్లి

స్థల వివాదంలో యువకుడిపై దాడి


దాడిలో గాయపడిన సురేష్

గుంతకల్లు రూరల్: వామిదొడ్డి స్థల వివాదంలో జరిగిన ఘర్షణలో సురేష్ అనే యువకుడు గాయపడ్డారు. పోలీసుల వివరాల మేరకు.. గుర్రబ్బాడు గ్రామానికి చెందిన బండయ్య, తిమ్మప్ప అన్నదమ్ముల పిల్లలు. వారిద్దరికి గ్రామ శివారులో పక్కపక్కనే వామిదొడ్లు ఉన్నాయి. ఈ క్రమంలో ఆదివారం ఉదయం బండయ్య కొడుకు సురేష్ వామిదొడ్డిని వెళ్లాడు. పక్క వామిదొడ్డిలో షెడ్డులో ఉంటున్న తిమ్మప్ప ఆతడి కుటుంబ సభ్యులు స్థల వివాదం విషయంలో వాగ్వాదానికి దిగారు. మాటామాట పెరగడంతో తిమ్మప్ప, అతని కుమారుడు శివారెడ్డి, కోడలు సరస్వతి, వారి పిల్లలు చందు, హేమంత్ అందరూ కలిసి సురేష్‌పై రాడ్, రాళ్లతో దాడి చేశారు. గాయపడిన సురేష్‌ను కుటుంబీకులు వెంటనే గుంతకల్లు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.

వృద్ధుడిపై దాడి


గాయపడిన వృద్ధుడు చిన్నప్ప

గుంతకల్లు రూరల్: పొలం గట్టుపై గడ్డి, ఇతర చెత్త వేశాడనే కారణంతో వృద్ధుడు చిన్నప్ప, ఆతడి కుమారుడు సుధాకర్, భార్య సునీతపై దాడి చేసి గాయపరిచారు. పోలీసుల వివరాల మేరకు.. మండలంలోని కదిరిపల్లికి చెందిన చిన్నప్ప తన పొలంలో తొలగించిన గడ్డి, ఇతర చెత్తను పక్కనే పొలం గట్టుపై వేశాడు. దీంతో పక్కపొలం రైతు లాలెప్ప వారితో గొడవకు దిగాడు. గడ్డి ఎందుకు వేశావని ఎటువంటి ఇబ్బంది ఉండదని చిన్నప్ప సర్దిచెప్పినా లాలెప్ప వినిపించుకోలేదు. దీంతో మాటామాట పెరిగింది. దీంతో లాలెప్ప ఆతడి భార్య సావిత్రి, కొడుకులు సుధాకర్, నారాయణస్వాములు చిన్నప్ప ఆతడి కుమారుడు సుధాకర్, భార్య సునీతపై దాడి చేశారు. దాడిలో చిన్నప్ప చెయ్యి విరిగ్గా, ఆతడి కొడుకు, కోడలుకు స్వల్పగాయాలయ్యాయి. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన రూరల్ పోలీసులు విచారణ చేపట్టారు.

'ధర్నాకు తరలిరండి'

శింగనమల: జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట సాగునీటి సాధన కోసం సోమవారం చేస్తున్న ధర్నాకు శింగనమల నియోజకవర్గం నుంచి రైతులు, ప్రజలు తరలిరావాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు బాలరంగయ్య, సీపీఎం మండల కార్యదర్శి భాస్కర్ కోరారు. ఆదివారం వారు మాట్లాడుతూ నియోజకవర్గంలోని శింగనమల, గార్లదిన్నె, బుక్కరాయసముద్రం, నార్పల, పుట్లూరు, యల్లనూరు మండలాల నుంచి పెద్దఎత్తున తరలివచ్చి ధర్నా విజయవంతం చేయాలన్నారు.

ఆధార్ సేవలు సద్వినియోగం చేసుకోండి

పామిడి: మండలంలో ఈ నెల 22 నుంచి 25వ తేదీ వరకూ నిర్వహించే ఆధార్ క్యాంపు సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ తేజోత్స్న సూచించారు. ఆదివారం ఆమె మాట్లాడుతూ స్థానిక పంచాయతీ కార్యాలయం, ఎద్దులపల్లిరోడ్డు సచివాలయంలో ఆధార్‌క్యాంపు సేవలు నిర్వహిస్తామన్నారు.

గుండెపోటుతో సర్పంచ్ భర్త మృతి


వెంకటేష్ నాయక్ (ఫైల్)

గుంతకల్లు రూరల్: గుంతకల్లు మండలంలోని పులగుట్టపల్లి పెద్దతండా సర్పంచ్ పార్వతి బాయ్ భర్త వెంకటేష్‌నాయక్ (43) ఆదివారం గుండెపోటుతో మృతిచెందాడు. ఉదయం పని నిమిత్తం గుంతకల్లుకు వచ్చిన ఆయన తిరిగి ఊరికి చేరుకున్నాడు. వెళ్లిన కొద్దిసేపటికే ఆతడికి చాతినొప్పి రావడంతో.. కుటుంబ సభ్యులు ఆతడిని గుంతకల్లు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కానీ మార్గమధ్యంలోనే ఆతడు మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. వారికి కుమారుడు, కూతురు ఉన్నారు. ఏడాది క్రితం కూతురు డెంగీ బారిన పడి మృతిచెందింది. సర్పంచ్ భర్త మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

ఫిర్యాదుల విభాగానికి హాజరుకండి

యల్లనూరు: స్థానిక తహసీల్దారు కార్యాలయంలో సోమవారం నిర్వహించే ప్రజా ఫిర్యాదుల విభాగానికి అన్ని శాఖల అధికారులు తప్పక హాజరుకావాలని ఆర్‌ఐ చిన్ననారాయణమ్మ సూచించారు. కార్యక్రమాన్ని మండలవాసులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

విద్యా ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోరాటం


కరపత్రాలను విడుదల చేస్తున్న ఏఐఎస్‌ఎఫ్ నాయకులు

గుంతకల్లుటౌన్: విద్యా ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఉద్యమాలను తీవ్రతరం చేస్తామని ఏఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు హనుమంతరాయుడు, కుల్లాయిస్వామి అన్నారు. ఆదివారం స్థానిక సీపీఐ కార్యాలయంలో జరిగిన సమావేశంలో నవంబర్ 27 నుంచి 30వ తేదీ వరకు విజయనగరంలో నిర్వహించే ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర 49వ మహాసభల కరపత్రాలను వారు విడుదల చేశారు. ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేయాలని, ఉన్నత చదువులకు శాపంగా మారిన జీఓ 77ను రద్దు చేయాలని, వైద్య విద్యను పేద విద్యార్థులకు దూరం చేస్తున్న కూటమి ప్రభుత్వంపై పోరాటాలు చేస్తామన్నారు. రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని వారు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గుంతకల్లు నియోజకవర్గం అధ్యక్ష, కార్యదర్శులు వినోద్, వెంకటేశ్, కోశాధికారి ఆలీ, పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు రోహిత్, శివమణి తదితరులు పాల్గొన్నారు.

జూనియర్ కాలేజీల్లో మధ్యాహ్న భోజన పథకం అమలు చేయాలి

గుత్తి: ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో ప్రభుత్వం మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రవేశ పెట్టాలని హరిత దివ్యాంగుల సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు బి.మోహన్ నాయక్ డిమాండ్ చేశారు. పట్టణంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ వసతి గృహం ఆవరణలో ఆదివారం ఆయన విద్యార్థులతో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రవేశ పెట్టడంతో పాటు విద్యాశాఖలో ఖాళీగా ఉన్న పోస్టులన్నింటినీ వెంటనే భర్తీ చేయాలన్నారు.

గుత్తి ఫోర్ట్ లయన్స్ క్లబ్ కమిటీ ఎన్నిక


లయన్స్ క్లబ్ కమిటీ నూతన సభ్యులు

గుత్తి: గుత్తి ఫోర్ట్ లయన్స్ క్లబ్ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పట్టణంలోని అనంతపురం రోడ్డులో ఉన్న విరూపాక్షి రెడ్డి ఫంక్షన్ హాల్లో ఆదివారం లయన్స్ క్లబ్ సభ్యుల సమావేశం నిర్వహించారు. సమావేశానికి గుత్తి సీనియర్ సివిల్ జడ్జి కాశీ విశ్వనాథ్ చారి, లయన్స్ క్లబ్ జిల్లా నాయకులు విరూపాక్షి రెడ్డి, సంబంధ మూర్తి, మక్బూల్, పామిడి ఎంపీపీ మురళీ మోహన్ రెడ్డి, పారిశ్రామికవేత్త జీవానందరెడ్డి తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా అధికారుల జ్యోతిని ప్రజ్వలన చేసి సమావేశాన్ని ప్రారంభించారు. లయన్స్ క్లబ్ చేస్తున్న సేవా కార్యక్రమాలను నవిస్తకులకు తెలియజేశారు. అనంతరం కమిటీ అధ్యక్షుడిగా బీసీ వెంకప్ప, కార్యదర్శిగా మహబూబ్ బాషా, ఉపాధ్యక్షులుగా ఐస్కూల్ గోపాల్, వెంకటేశ్వరరెడ్డి, కోశాధికారిగా ఆకులు శ్రీనివాసులు, మరో 25 మంది సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన కమిటీ సభ్యులు మాట్లాడుతూ సేవా కార్యక్రమాలను విస్తరిస్తామన్నారు.

అశ్వత్థం క్షేత్రానికి పోటెత్తిన భక్తులు


అలంకరణలో సుబ్రహ్మణ్యేశ్వర స్వామి


అలంకరణలో నారాయణ స్వామి


స్వామిని దర్శించుకుంటున్న భక్తులు

పెద్దపప్పూరు: మండలంలోని చిన్నపప్పూరు గ్రామ సమీపంలో పెన్నానది ఒడ్డున వెలసిన అశ్వత్థ నారాయణ స్వామి క్షేత్రానికి ఆదివారం భక్తులు పెద్దఎత్తున తరలివచ్చారు. భక్తులు క్షేత్రంలో చక్కిలి స్నానమాచరించి నారాయణ స్వామి కట్టపై వెలసిన సింగరభట్లు, గణపతి, నారాయణ స్వామి అభయాంజనేయ, సీతారాములు, శ్రీకృష్ణార్జునులు, నవగ్రహాలకు పూజలు చేయడంతో పాటు చక్ర భీమలింగేశ్వర స్వామి, శీవల్లి సుబ్రమణ్యేశ్వర శమీవృక్షానికి ప్రదక్షిణలు చేశారు. కోర్కెలు నెరవేరిన భక్తులు నారాయణ స్వామికి ముడుపులు, కానుకలతో పాటు తలనీలాలను సమర్పించి మొక్కుబడులు చెల్లించుకున్నారు.

కోటంకలో ప్రత్యేక పూజలు

గార్లదిన్నె: మండలంలోని కోటంక కొండల్లో వెలసిన సింగంటి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం అర్చకుడు రామాచార్యులు క్షీరాభిషేకం, పంచామృత అభిషేకం, ఆకుపూజ, అర్చనలు, మహానైవేద్యం తదితర పూజలు నిర్వహించారు.

ధర్మ ప్రచారంలో భాగస్వాములు కావాలి


ప్రచారం చేస్తున్న దృశ్యం

బుక్కరాయసముద్రం: ధర్మ ప్రచారంలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని శ్రీ సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు మల్లికార్జున సూచించారు. ఆదివారం మండల కేంద్రంతోపాటు కొట్టాలపల్లిలో త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ దైవ చింతనలో జీవించాలన్నారు. తోటి వారికి సహాయ పడే గుణం ఉండాలే గానీ మోసం చేసే గుణం వీడాలన్నారు. అనంతరం కరపత్రాలు, పుస్తకాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాగిరెడ్డి, నీలావతి, విజయలక్ష్మి, నాగమణి, లక్ష్మీదేవి, నాగేశ్వర, మాధవి, పాల్గొన్నారు.

బాణసంచా విక్రయాలకు అనుమతి తీసుకోండి

యల్లనూరు: దీపావళి పండుగకు బాణసంచా విక్రయాలకు పోలీసుల అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని పుట్లూరు సీఐ సత్యబాబు సూచించారు. మండలంలో ఎక్కడైనా పోలీసుల అనుమతి లేకుండా టపాసుల విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. టపాసుల విక్రయాలకు పోలీస్‌స్టేషన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఎక్కడైనా అనధికార టపాసుల అమ్మకాలు చేస్తుంటే పోలీసులకు తెలియజేయాలన్నారు.

టార్పాలిన్ పట్టలకు నిప్పు

పుట్లూరు: మండలంలోని సంజీవపురంలో నాగప్ప అనే వ్యక్తికి చెందిన టార్పాలిన్ పట్టలకు గుర్తుతెలియని వ్యక్తులు నిప్పుపెట్టడంతో పూర్తిగా కాలిపోయాయి. వివరాలు.. గ్రామంలో ఆయన కొలిగాణ ఉంకుతో పాటు పట్టలను సూర్పిని చేసుకోవడానికి తార్పాలిన్ పట్టలను బాడుగకు అందుబాటులో ఉంచాడు. వాటి ద్వారా ఆయన జీవనోపాధి పొందుతుండగా శనివారం రాత్రి 60 తార్పాలిన్ పట్టలకు గుర్తు తెలియని వ్యక్తులు నిప్పుపెట్టారు. ఈ విషయమై బాధితుడు ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

గ్రామాల్లో 'పల్లె పండుగ'

పామిడి/గార్లదిన్నె: పామిడి మండలంలోని గజరాంపల్లి, కత్రిమల, కట్టకిందపల్లి గ్రామాల్లో ఆదివారం పల్లెపండుగ కార్యక్రమాలు నిర్వహించారు. ఎంపీడీఓ తేజోత్స్న ఆధ్వర్యంలో ఈఓఆర్డీ కృష్ణకుమార్ సారథ్యంలో ఈ కార్యక్రమాలు చేపట్టారు. ఈసందర్భంగా ఆయా గ్రామాల్లో రూ.40 లక్షలతో కూడిన వివిధ అభివృద్ధి పనులకు వారు భూమి పూజ చేశారు. టీడీపీ మండల నాయకులు, మునిరెడ్డి, మారుతీప్రసాదరెడ్డి, హనుమంతరెడ్డి తదితరులు పాల్గొన్నారు. అలాగే గార్లదిన్నె మండలంలోని మర్తాడు, కోటంక గ్రామ పంచాయతీలో ఆదివారం అధికారులు పల్లె పండుగ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపీడీఓ యోగానంద రెడ్డి మాట్లాడుతూ మర్తాడులో రూ.30 లక్షలు, కోటంకలో రూ.10 లక్షలు ఉపాధి పథకం నిధులతో సీసీ రోడ్లు నిర్మాణ పనులకు భూమిపూజ చేశామన్నారు. కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

విజయవంతం చేయండి

యల్లనూరు: మండలంలోని జంగంపల్లి, పాతపల్లి, వెన్నపూసపల్లి గ్రామాల్లో పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా నూతన రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్నామని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ వాసుదేవరెడ్డి ఆదివారం తెలిపారు. ఆయా పంచాయతీల్లో ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

నేడు గ్రామసభలు..

పామిడి: ల్యాండ్ పర్మినెంట్ మ్యాపింగ్ ద్వారా తలెత్తిన సమస్యలను పరిష్కారం కోసం సోమవారం జీఏ కొట్టాల, పొగరూరులో గ్రామసభలు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ శ్రీధర్‌మూర్తి ఆదివారం తెలిపారు. అలాగే 22న రామగిరి, ఎద్దులపల్లి, 23న తంబళ్లపల్లి, రామరాజుపల్లి గ్రామాల్లో గ్రామసభలు నిర్వహిస్తామన్నారు. రైతులు హాజరై సందేహాలు నివృత్తి చేసుకోవాలన్నారు.

గార్లదిన్నె: మండలంలోని ఓబుళాపురం,జంబులదిన్నెలో సోమవారం రెవెన్యూ గ్రామ సభ నిర్వహించనున్నట్లు తహసీల్దార్ ఈరమ్మ తెలిపారు. ఆదివారం ఆమె మాట్లాడుతూ రీసర్వే చేసిన గ్రామాల్లో భూ సమస్యలుంటే రైతులు అర్జీలు అందజేయాలన్నారు.

కంప్యూటరైజేషన్ వేగవంతం చేయాలి

గార్లదిన్నె: మండల కేంద్రంలోని జంబులదిన్నె సొసైటీ కార్యాలయంలో రైతుల వివరాలు కంప్యూటరైజేషన్ పనులు వేగవంతం చేయాలని ఎంపీడీఓ యోగానందరెడ్డి సూచించారు. ఆదివారం ఆయన సొసైటీ కార్యాలయంలో కంప్యూటరైజేషన్ పనులు పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ నవంబర్ 1 లోపు సొసైటీలోని ఖాతాదారుల వివరాలను కంప్యూటరైజేషన్ చేయాలన్నారు. అలాగే సహకార సంఘంలోని సభ్యుల ఆధార్ కార్డు,పాస్ బుక్, అండంగల్‌తో కేవైసీని చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సొసైటీ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

దాడిలో యువకుడికి గాయాలు

తాడిపత్రి అర్బన్: పట్టణంలో ఓ యువకుడికి గాయాలయ్యాయి. అర్బన్ పోలీసుల కథనం మేరకు.. పట్టణంలోని అనుపల్లి పాతలకు చెందిన ఆయూబ్ , తన స్నేహితుడు భాజాతో కలిసి శనివారం రాత్రి కల్లూరు వీరితోని జెండా కట్ట వద్ద కూర్చొని ఉండగా అక్కడకు వచ్చిన మౌలాలి అనే యువకుడు ఒక్కసారిగా వచ్చి కూర్చున్నాడు.. మీకేం పనిలేదా అని ప్రశ్నించాడు. దీంతో వారి మధ్య వాగ్వాదం పోటు చేసుకుంది. దీంతో మౌలాలి తన దగ్గర ఉన్న కత్తితో ఆయూబ్‌ను దాడి చేశాడు.. ఆయూబ్ గొంతుకు తీవ్ర గాయం కావడంతో ఆస్పత్రికి తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

జాతీయస్థాయి త్రైక్వాండో పోటీలకు ఎంపిక


రవి

గుత్తి: పట్టణానికి చెందిన రవి అనే యువకుడు జాతీయ స్థాయి త్రైక్వాండో పోటీలకు ఎంపికైనట్లు సాయి స్పోర్ట్స్ యూనియన్ త్రైక్వాండో మాస్టర్ సాయి తేజ ఆదివారం తెలిపారు. గత శనివారం అనంతపురంలోని సాయిబాబా కాలేజీలోని ఇండోర్ స్టేడియంలో జరిగిన సెలక్షన్ పోటీలో రవి 68 కేజీల విభాగంలో పాల్గొన్నారు. ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయి (ఇంటర్ యూనివర్సిటీ)కి ఎంపికయ్యాడు. ఆతడిని త్రైక్వాండో క్రీడాకారులు అభినందించారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక


భరత్

పుట్లూరు: అనంతపురంలోని ఆర్డీటీ మైదానంలో ఈ నెల 19న నిర్వహించిన అండర్–17 కబడ్డీ సెలెక్షన్స్‌లో భరత్ అనే విద్యార్థి రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైనట్టు వ్యాయామ ఉపాధ్యాయుడు మురళి ఆదివారం తెలిపారు. ఎంపికైన విద్యార్థిని ప్రధానోపాధ్యాయుడు సురేష్ బాబు, ఉపాధ్యాయులు అభినందించారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం


నార్పల ప్రభుత్వ వసతి గృహ పూర్వ విద్యార్థుల సమ్మేళనం

శింగనమల: నార్పలలోని ప్రభుత్వ వసతి గృహ పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం బొమ్మలాటపల్లి ఎర్రితాత స్వామి ఆలయ ప్రాంగణంలో ఘనంగా నిర్వహించారు. పూర్వ విద్యార్థులందరూ కలిసి 1978–1988 మధ్య వసతి గృహంలో చదువుకున్న రోజుల్లోని జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. చదువుకోవడం ద్వారానే తాముంత వివిధ హోదాల్లో ఉన్నామని గుర్తు చేసుకున్నారు. ఏపీఎం నారాయణస్వామి, కుళ్లాయప్ప, లక్ష్మయ్య స్వామి, శివయ్య, సంజప్ప, వెంకటప్ప, సుంకలయ్య, పెద్దన్న, అంకన్న తదితరులు పాల్గొన్నారు.